
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
గురువారం 7 ఆగస్టు 2025



కష్టసుఖాల కలనేత..



వృద్ధ కార్మికులకే పరిమితమైన చేనేత రంగం

- మరమగ్గాల వైపే యువకుల మొగ్గు
- జిల్లాలో ఆరు సొసైటీల్లో వస్త్ర ఉత్పత్తి
- ఏటా రూ.2 కోట్ల విలువైన వస్త్రోత్పత్తి
- 169 చేనేత మగ్గాలు.. 325మంది కార్మికులు
- నేడు జాతీయ చేనేత దినోత్సవం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

మగువల మనసు దోచేలా రంగురంగుల దారాలతో అందమైన చీరలు నేయడం నేతన్నల గొప్పతనం. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో చేనేత కళాకారులు తమ నైపుణ్యాన్ని ఖండాంతరాలు చాటారు. ఒకనాడు గొప్పగాఉన్న చేనేత మగ్గాలు ఇప్పుడు మూగ బోతున్నాయి. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో మరమగ్గాలు అగ్రభాగాన చేరి చేనేత ఉపాధిని దెబ్బతీసింది. చేనేతను వదిలి యువత పవర్‌లూమ్ పరిశ్రమ వైపు అడుగులు వేసి కష్టాలకు ఎదురీదుతుంటే, చేనేతమగ్గాలు వృద్ధులకే పరిమితమయ్యాయి.

చేనేత వస్త్ర పరిశ్రమను నిలబెట్టే దిశగా ప్రభుత్వం కార్మికులకోసం పలు పథకాలు తీసుకొస్తున్నా ఆశించిన ఫలితాలు రావడం లేదు. చేనేత కార్మికుల జీవనయానంలో కష్టసుఖాల కలనేత జీవితంగా ముందుకు సాగిపోతున్నారు. తాము బతకడంతో పాటు మరో పదిమందికి ఉపాధి కల్పించిన చేనేత కార్మికులు కాలక్రమేణా సంభ విస్తున్న మార్పులతో కులవృత్తిని వదిలి ఇతర వృత్తుల్లోకి వెళుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక గల్ఫ్ దేశాలకు వలస వెళుతున్న వారున్నారు. జిల్లాలో చేనేత మగ్గం వృద్ధులకే పరిమితం కాగా యువకులు మరమగ్గాలవైపు మళ్లారు. కొంతమంది చేనేత కళను బతికించడానికి ప్రయత్నం చేస్తున్న వారున్నారు. సిరిసిల్లలో కొందరు యువకులు చేనేత మగ్గాలపై ఒకనాటి అగ్గిపెట్టెలో అమిరే చీర స్ఫూర్తిని కొనసాగిస్తున్నారు. విభిన్నమైన వస్త్రాలను తయారు చేస్తున్నారు. సిరిసిల్లలో మెట్‌పల్లి ఖాదీగ్రామోద్యోగ ప్రతిష్ఠాన్‌తో పాటు కొన్ని సహకారసంఘాలు కార్మికులకు కొంత చేయూతను, ఉపాధిని కల్పిస్తున్నాయి. చేనేత కార్మికుడికి పదిహేను రోజుల పాటు కష్టపడితే రూ 1500 నుంచి రూ.2000 వరకే కూలి లభిస్తోంది. చేనేత మగ్గాలకు కండెలు చుట్టే వృద్ధ మహిళలు ఒక నూలు లడి చుడితే రూ 10రూపాయలు మాత్రమే లభిస్తాయి. పొద్దంతా చుడితే 50రూపాయలు మాత్ర మే గిట్టుబాటు అవుతుంది. చీరలోని గొప్పతనాన్ని చాటుతూ అగ్గిపెట్టెలో సైతం అమిరే చీర, కుట్టులేని దుస్తులు, మగ్గంపై మనుషుల చిత్రాలను నేసి ప్రపంచాన్ని అబ్బురపరిచిన సిరిసిల్ల చేనేత పరిశ్రమ ఉనికిని మాత్రం కొందరు యువకులు బతికించే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని యెల్ది హరిప్రసాద్, నల్లవిజయ్ చేనేత, మరమగ్గాలపై వినూత్నంగా వస్త్రాలను తయారుచేస్తున్నారు. హరిప్రసాద్ తయారు చేసిన వస్త్రాలను ప్రధానమంత్రి మన్‌కీబాత్‌లో ప్రస్తావించడం, మూడవ సారి ప్రమాణ స్వీకారానికి సైతం ఆహ్వానం అందుకొని వెళ్లారు. ఆంధ్రా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఒక అభిమాని ద్వారా డ్రెస్సులకోసం ఆర్డర్లుఇచ్చి తయారీ చేయించారు. హరిప్రసాద్, నల్ల విజయ్‌లు చేనేత రంగంలో చేసిన కృషికి అనేక అవార్డులను కూడా అందుకున్నారు. హరిప్రసాద్ సతీమణి రేఖ కూడా చేనేత మగ్గంపై నేసిన పట్టు చీరకు రాష్ట్ర స్థాయిలో కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డును అందుకోబోతున్నారు.

● తెగిపోతున్న పోగు బంధం..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో వ్యవసాయం, తరువాత చేనేత రంగంపైనే అనేక దశాబ్దాలుగా ఉపాధి పొందారు. చేనేత మగ్గాలపై జరీ చీరల అంచులు తళుక్కున మెరిసేవి. మరమగ్గాల వైపు కార్మికులు మారడంలో వేలల్లో ఉన్న చేనేత మగ్గాలు వందల సంఖ్యకు చేరాయి. వాటి స్థానంలో సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 35 వేల మరమగ్గాలపై వస్త్ర ఉత్పత్తి జరుగుతోంది. దీంతో చేనేత మగ్గాలతో పోగు బంధం తెగిపోతోంది. జిల్లాలో చేనేత మగ్గాలు లయ తప్పాయి. చేనేత సహకార సొసైటీలు మూలన పడ్డాయి, ప్రస్తుతం జిల్లాలో ఆరు సొసైటీలు మాత్రమే పనిచేస్తున్నాయి.

చేనేత మగ్గాల స్థానంలో మరమగ్గాలు చేరాయి. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 35వేల మరమగ్గాలపై వస్త్ర ఉత్పత్తి జరుగుతోంది. 1984లో సిరిసిల్ల జిల్లాలో చేనేత మగ్గాలు ఆరువేల వరకు ఉండగా, ఇప్పుడు జియో ట్యాగింగ్ చేసిన ప్రకారం 169మగ్గాలు ఉన్నాయి. ఈ మగ్గాలపై 325 మంది కార్మికులు మాత్రమే ఉన్నారు. ఉపాధి పొందుతున్నవారు కార్మికులు 212మంది ఉన్నారు. చేనేత కళను బతికించడానికి కార్మికులకు ఉపాధి కల్పించే దిశగా గత ప్రభుత్వం 2017లో చేనేత లక్ష్మి పథకాన్ని కూడా ప్రవేశపెట్టింది. రాజన్నసిరిసిల్ల జిల్లాలో వివిధశాఖల ఉద్యోగులు..

మిగతా 8లో..

నేడు జిల్లా స్థాయి ఖోఖో ఎంపిక పోటీలు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని రైజింగ్ ఫిట్నెస్, స్పోర్ట్స్ అకాడమీ క్రీడా మైదానంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు జిల్లాస్థాయి ఖోఖో(ఓపెన్ టూ హాల్) ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు ఖోఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే మొయినొద్దిన్ బుధవారం తెలిపారు. జిల్లా పరిధిలోని 13 మండలాలకు చెందిన ఖోఖో క్రీడాకారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నాలని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ఖోఖో పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఈనెల 10న కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగే ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి ఖోఖో పోటీలలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఖోఖో జట్టు పాల్గొంటుందన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత

వీర్నపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మారుమూల పల్లెలు, తండాల ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత అన్నారు. వీర్నపల్లి మండలం భూక్యతండా గ్రామపరిధిలోని రాశిగుట్ట తండాలో వైద్యశిబిరాన్ని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది ఇంటింటా తిరిగి చేస్తున్న ఫీవర్ సర్వేను ఆమె పరిశీలించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. వీహెచ్‌సీలోని మందులను, రికార్డులను పరిశీలించారు. మలేరియా అధికారి డాక్టర్ అనిత మండల వైద్యాధికారి డాక్టర్ స్నేహ, వైద్యులు బాలకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ చైతన్య, స్నేహ, ఆకాష్, సూపర్‌వైజర్ ఇందిర, పద్మ, ఏఎన్‌ఎంలు కీర్తి,సుజాత, భారతి, శారద, ఇందిర, సువర్ణ, అమృతవల్లి, రూతమ్మ, హెల్త్‌అసిస్టెంట్ రమేష్, బాబు, ఆశావర్కర్లు ఉన్నారు.

జాతీయ చేనేత దినోత్సవానికి ఏర్పాట్లు

సిరిసిల్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయ చేనేత దినోత్సవానికి నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు చేనేత జౌళి శాఖ ఏడీ రాఘవరావు ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం ఉదయం 9.30 గంటలకు సిరిసిల్ల పాత బస్టాండ్ వద్ద నేతన్న విగ్రహానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేస్తారని పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు వేములవాడలోని చేనేత సహకార సంఘం నుంచి వ్యవసాయ మార్కెట్ కమిటీ వరకు చేనేత వాక్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీలో సమావేశం ఉంటుందని తెలిపారు.

రిజర్వేషన్లు ఖరారు చేసే హక్కు రాష్ట్ర ప్రభుత్వానిదే..

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి



సిరిసిల్లలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లను ఖరారుచేసే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికే ఉంటుందని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మతపరమైన రిజర్వేషన్లు ఇవ్వరాదని సుప్రీం కోర్టు తీర్పులో ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు ముందుకు తీసుకవచ్చి బీజేపీని బదనాం చేసే ప్రయత్నం చేస్తోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలుచేయాల్సిన బీసీ రిజర్వేషన్‌లు 42శాతం ఎందుకు అమలుచేయడం లేదో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం ఇవ్వాలన్నారు. 243 ఆర్టికల్ ప్రకారం అమెండ్‌మెంట్ 73-74 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలే రిజర్వేషన్‌లను ఖరారు చేసుకోచ్చని అన్నారు. అయినప్పటికి కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నాయకులు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేయడం సిగ్గుచేటన్నారు. 12 శాతం ఉన్న ముస్లింలకు 10శాతం రిజర్వేషన్లు ఎందుకు కల్పించాలో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌పై కాంగ్రెస్ పార్టీ మాట తప్పిందన్నారు. మైనార్టీ ఓట్ల కోసం ముస్లిం డిక్లరేషన్‌ను అమలుచేయాలని చూస్తోందన్నారు. బీసీలను కాంగ్రెస్‌ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి బీసీలపై ప్రేమ ఉంటు బీసీ విద్యార్థులకు రావాల్సిన రూ.8వేల కోట్లు ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముస్లిం రిజర్వేషన్‌లు తీసేసి 42 శాతాన్ని బీసీలకు కేటాయిస్తూ కాంగ్రెస్ పార్టీ తీర్మానం చేస్తే దానిని బీజేపీ ఆమోదిస్తుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఎప్పుడో ప్రకటించారని గుర్తుచేశారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మ్యాన రాంప్రసాద్, మహిళా మోర్చా జిల్లా మాజీ అధ్యక్షురాలు బర్కం వెంకటలక్ష్మీ, నవీన్, మల్లారెడ్డి, సురేందర్‌రావు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి

గంభీరావుపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేటలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహ నిర్మాణానికి అనుమతి ఇప్పించాలని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి బుధవారం విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య వేదిక ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు గంట అశోక్, మాల మహానాడు నాయకులు దోసల చంద్రం, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు వేణు, ప్రభాకర్, కృష్ణప్రసాద్, రాజు, నర్సింహచారీ, స్వామి పాల్గొన్నారు.

యూరియా కొరత తీర్చాలి

చందుర్తి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి):చందుర్తి మండలంలో నెలకొన్న యూరియా కొరతను తీర్చాలని కోరుతూ తహసీల్దార్ శ్రీనివాస్‌కు బీజేపీ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ యూరియా కోసం రైతులు సహకార సంఘ సొసైటీలా ముందు రైతులు ఎదురుచూస్తున్నారన్నారు. యూరియ కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిర్రం తిరుపతి, సిరికొండ తిరుపతి, మేడిశెట్టి శ్రీహరి, రమేష్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర సైబర్ నేరస్థుడి అరెస్ట్
- ఆరోగ్యశ్రీ పేరుతో ఆన్‌లైన్ మోసాలు
- డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడి
6

చిన్నారులకు పౌష్టికాహారం అందివ్వాలి
- రూ.20 కోట్లతో 170 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం.. ఆరు నెలల్లో అందుబాటులోకి..
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
8

తెలంగాణ ఉద్యమానికి జయశంకర్ జీవితం అంకితం..

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా - కలెక్టరేట్‌లో ఘనంగా నివాళులు..

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్‌సార్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కలెక్టర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీవితమంతా తెలంగాణ ఉద్యమానికి స్వరాష్ట్ర ఏర్పాటుకు అంకితం చేసిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని, ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. తెలంగాణనే ఆశ, శ్వాసగా జీవించి ఉద్యమానికి దిక్సూచిగా నిలిచారని కొనియాడారు. తెలంగాణ తొలిదశ ఉద్యమంలో పోరాడి మలిదశ ఉద్యమంలో స్వరాష్ట్ర సాధనకు మార్గదర్శనంగా నిలిచారని అన్నారు. జయశంకర్ సార్ మన మధ్యలో లేనప్పటికి అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు తమ వంతూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీపీఆర్‌వో వంగరి శ్రీధర్, జిలా యువజన సర్వీస్ శాఖ అధికారి రాందాస్, మైనింగ్ ఏడీ క్రాంతికుమార్, కలెక్టరేట్ పర్యవేక్షకులు రాంచందర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్ధాపూర్ 17వ పోలీస్ బెటాలియన్‌లో జయంతి వేడుకలను నిర్వహించారు. కమాండెంట్ ఎంఐ సురేష్, అసిస్టెంట్ కమాండెంట్ జగదీశ్వర్‌రావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘ కార్యాలయంలో వేడుకలను నిర్వహించారు. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, ఎండీ రామసుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

కనీస వేతనాల చట్టాన్ని అమలు చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్



రిలే దీక్షలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సుదర్శన్

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తయారు చేసే కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాల చట్టాన్ని అమలు చేయడంతోపాటు వారి సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులతో రిలే నిరాహార దీక్షలను బుధవారం చేపట్టారు. దీక్ష శిబిరాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు పాల్గొని దీక్షలో కూర్చోని మధ్యాహ్న భోజన కార్మికులకు దండలు వేసి దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా మధ్యాహ్న భోజన కార్మికులకు రూ 10వేల చొప్పున జీతాన్ని వెంటనే అమలుచేయాలన్నారు. గత సంవత్సర కాలం నుంచి కోడిగుడ్ల బిల్లులు రాక మధ్యాహ్న భోజన కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించి వారిని ఆదుకోవాలన్నారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు మాట్లాడుతూ అనేక పోరాటాలు చేయడంతోనే మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.2వేలు పెంచిందన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, నిత్యావసర సరుకులు ప్రభుత్వమే సరఫరా చేయాలని, మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మన్, మధ్యాహ్నభోజన కార్మికులుజుబేదా, లక్ష్మీనర్సవ్వ, విజయ, జ్యోతి, మమత, రోజా, లక్ష్మి, కొమురవ్వ, ఇమాం బేగం, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ : కలెక్టర్



లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా, కేకే మహేందర్‌రెడ్డి

తంగళ్లపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ నూతన రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. బుధవారం తంగళ్లపల్లి మండలం బద్దనపల్లిలోని ఎస్ఎస్ గార్డెన్స్‌లో లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అర్హులైన 1397 మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులతో పాటు 2224 మంది కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేసి అందిస్తున్నామని వెల్లడించారు. ప్రజల జీవనంలో రేషన్ కార్డు చాలా కీలకమైందని ఆధార్ కార్డు, కరెంటు కనెక్షన్ ప్రభుత్వ పథకాల అమలులో కీలకమని అన్నారు. ప్రతి లబ్ధిదారుడికి నెలకు 6 కిలోల సన్న బియ్యం రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. నూతన రేషన్ కార్డు ద్వారా ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్ వంటి అనేక సంక్షేమ పథకాలకు అర్హత వస్తుందని స్పష్టం చేశారు. రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం రేషన్ కార్డుల ఊసే ఎత్తలేదని ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు రేషన్ కార్డులు అందిస్తున్నామన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీ, కుటుంబ సభ్యుల పేర్లు నమోదు, రైతు భరోసా, రైతు బీమా, రైతు రుణమాఫీ, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని పేర్కొన్నారు. అలాగే మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, మహిళా శక్తి కింద క్యాంటీన్లు, మిల్క్ పార్లర్, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంక్, ఫర్టిలైజర్ దుకాణాలు, ఇతర స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేయిస్తోందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ స్వరూపతిరుపతిరెడ్డి, ఆర్డీవో వెంకటేశ్వర్లు, డీడబ్ల్యూవో లక్ష్మీరాజ్యం, తహసీల్దార్ జయంత్ కుమార్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు జల్గం ప్రవీణ్ కుమార్, డైరెక్టర్లు పొన్నల పర్శరాములు, ఆరెపెల్లి బాలు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో శేషాద్రి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులను గుర్తించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేసేలా చర్యలు చేపట్టాలని డీఆర్డీవో శేషాద్రి ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట, ముస్తాబాద్ మండలాలకు సంబంధించిన అధికారులతో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై ఆరా తీశారు. పనుల్లో జాప్యం జరగకుండా క్షేత్ర స్థాయిలో పర్యటించి వేగవంతం చేయాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ రవిశంకర్, ఎంపీడీవోలు సత్తయ్య, బీరయ్య, రాజేందర్, లచ్చాలు, ఏఈలు పాల్గొన్నారు.

కార్మికుల శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం

- సీఐటీయూ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): శ్రమదోపిడీకి గురవుతున్న బీడి కార్మికుల నుంచి సంతకాలను సేకరిస్తామని సీఐటీయూ బీడీ సిగార్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాముల రమేష్‌చంద్ర, సూరం పద్మలు అన్నారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌తలోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో బుధవారం బీడీ,సిగార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం దాసరి రూప అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో వారు మాట్లాడుతూ బీడీ కంపెనీల యాజమాన్యం కార్మికుల నుంచి నెలకు రూ.2వేల బీడీల కూలీ పని చేసిన చేయకునన్నా కార్మికులను దోచుకుంటున్నారన్నారు. దీంతోపాటు 100గ్రాములు ఆకు, 50 గ్రాములు తంబాకును తగ్గించి ఇస్తున్నారన్నారు. బీడీలు రాసే కార్డుకు నెలకు రూ.50 చొప్పున వసూలు చేస్తున్నారన్నారు. ఇలా బీడీ కార్మికులను దోచుకుంటున్నారన్నారు. బీడీ కార్మికులు నెల రూ.3 వేల నుంచి 4వేల సంపాదిస్తే అందులో నుంచి రూ.వెయ్యి కంపెనీ యాజమాన్యం తీసుకుంటుందన్నారు. బీడీ కార్మికుల సమస్యలను తెలుసుకునేందుకు సీఐటీయూ బీడీ సిగార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సంతకాలను సేకరించి హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్‌కు ఇస్తామన్నారు. సమావేశంలో జిల్లా కోశాధికారి జిందం కమలాకర్, కార్యదర్శి బెజ్జుగం సురేష్, బోనాల లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

చిగురుమామిడి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుందరగిరిలో బుధవారం గ్రామానికిచెందిన గీరబోయిన అజయ్(21) బైక్ అదుపు తప్పి పడి మృతిచెందినట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అజయ్ నవాబుపేటనుంచి స్వగ్రామం సుందరగిరికి బైక్‌వస్తున్నాడు. అదుపుతప్పి రోడ్డుపక్కనున్న విద్యుత్‌స్థంభాన్ని ఢీకొట్టాడు. దీంతో బలమైనగాయాలై సంఘటన స్థలంవద్దే మృతిచెందాడు. మృతుడు అజయ్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్నకొండలో గుర్తు తెలియని మృతదేహం

చొప్పదండి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్నకొండ శివారులోని వ్యవసాయబావిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమయింది. ఎస్ఐ నరేష్‌రెడ్డి కథనం మేరకు ఆర్నకొండ శివారులోని వ్యవసాయ బావిలో మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సుమారు 40నుంచి 45సంవత్సరాల వయస్సు ఉండి, ఒంటిపై బిస్కెట్ రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని, ఎడమ చేతికి ఓం సింబల్ గల ఆరెంజ్ రంగు దారం ఉందని తెలిపారు. ఆర్నకొండ పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్‌రెడ్డి తెలిపారు. వ్యక్తి వివరాలు తెలిసిన వారు తమకు సమాచారం అందించాలని ఆయన తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగినేడు గ్రామానికిచెందిన దయాకర్ (29) ఆర్థికఇబ్బందులతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దయాకర్ పెద్దపల్లి ఉంటూ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం వాహనం కొనుగోలుకు మూడు లక్షల రూపాయలు అప్పు చేశాడు. వాహనం కొనకపోవడం, అప్పులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాడు. ఆర్థికఇబ్బందులు భరించలేక ఇంట్లో ఎవరులేని సమయంలో మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి భార్య దేవపాల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లేష్ తెలిపారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాసులపల్లి గ్రామానికి చెందిన మహంకాళి (53) చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడు మహంకాళి కొంతకాలంగా మద్యానికి బానిసైనట్లు బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగినట్లు తెలిపారు. గమనించిన కుటుంబసభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య మల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

యువకుడి అదృశ్యం



రాజ్‌కుమార్

ధర్మారం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందని చిప్ప రాజ్‌కుమార్(32) అనే యువకుడు సోమవారం కుమారుడి ఆసుపత్రి కాగితాలు తీసుకువస్తానని ఇంట్లో చెప్పి కరీంనగర్ వెళ్లాడు. రాత్రి వరకు రాకపోవడంతో అతని భార్య ఫోన్‌చేయగా కరీంనగర్ బస్టాండ్‌లో బస్‌కోసం చూస్తున్నానని, నేను వచ్చేసరికి ఆలస్యమవుతుందని చెప్పాడు. మంగళవారం తెల్లవారుజాము వరకు కూడా రాజ్‌కుమార్ రాకపోవడంతో భార్య ఫోన్ చేయగా ఫోన్ ఎత్తలేదు. ఉదయం మళ్లీ ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో కుటుంబసభ్యులు బుదవారం వరకు బంధువులతో పాటు అతనిస్నేహితులకు ఫోన్‌చేసి సమాచారం తెలుసుకోగా రాజ్‌కుమార్ ఆచూకీ లభించలేదు. రాజ్‌కుమార్ తండ్రి చిప్పరవి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

వీధి కుక్కల దాడిలో నెమలి మృతి

హుజూరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో బుధవారం జనావాసాల్లో నెమలి ప్రత్యక్షమైంది. పట్టణంలోని ఇల్లందుల వాడలో నెమలి సంచరిస్తుండగా వీధికుక్కలు దాడిచేశాయి. దీంతో నెమలికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన ఓ పాల వ్యాపారి నెమలిని కుక్కలబారి నుంచి కాపాడి అటవీశాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అటవీశాఖాధికారులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రథమచికిత్స చేద్దామని ప్రయత్నించగా, అప్పటికే నెమలి మృతిచెందింది. మృతి చెందిన నెమలిని అధికారులు పోస్టుమార్టంకు తరలించారు.

విద్యార్థుల కోసం ఎన్‌ఎస్‌పీ పోర్టల్



- స్కాలర్‌షిప్‌ల కోసం డిజిటల్ ప్లాట్‌ఫారం
- ఒకే గొడుగు కిందికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు

చొప్పదండి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ విద్యార్థులకు ఆసరాగా నిలుస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు వివిధ ప్రభుత్వ సంస్థలు విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్‌లు అన్ని ఒకే గొడుకు కిందకు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లోకి తీసుకువచ్చారు. ఎన్‌ఎస్‌పీ ఒక డిజిటల్ ప్లాట్ ఫారంగా నిలుస్తుండగా విద్యార్థులకు మంజూరైన స్కాలర్‌షిప్‌లు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి డీబీటీ(డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ద్వారా జమ చేస్తారు. విద్యార్థులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే వెరిఫై చేస్తారు. ఈ పోర్టల్‌లో విద్యార్థి ఒకసారి రిజిస్టర్ చేసుకుంటే అన్ని రకాల స్కాలర్‌షిప్‌లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వీలుంటుంది. విద్యార్థి వివరాలు, బ్యాంకు ఖాతా, ఆధార్, విద్యార్హతను ఈ పోర్టల్ ద్వారా డిజిటల్‌గానే వెరిఫై చేసి స్కాలర్‌షిప్‌ను మంజూరు చేస్తారు.

ఈ స్కాలర్‌షిప్‌లు 1వ తరగతి నుంచి పీజీ, పీహెచ్‌డీ వరకు చదువుతున్న విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. వార్షిక కుటుంబ ఆదాయం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ ఈడబ్ల్యుఎస్ కేటగిరీల వారీగా విద్యార్థులకు 5 వేల నుంచి 50 వేల రూపాయల వరకు స్కాలర్‌షిప్‌లను ఏడాదికి అందజేయనున్నారు.

స్కాలర్‌షిప్ వివరాలు

ఎన్‌ఎస్‌పీలో కేంద్ర ప్రభుత్వం పలు రకాల స్కాలర్‌షిప్‌లను అందజేస్తుంది.



- పోస్టు మెట్రిక్, ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్
- మెరిట్ కమ్‌మీన్స్ స్కాలర్‌షిప్
- టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్ (ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మాత్రమే)
- యూజీసీ స్కాలర్‌షిప్, ఇషాన్ ఉదయ్, సింగిల్ గర్ల్ చైల్డ్(పీజీ విద్యార్థులకు)
- ఏఐసీటీఈ-ప్రగతి స్కాలర్‌షిప్(బాలికలు), సక్షం స్కాలర్‌షిప్(దివ్యాంగులు)
- సీఎస్ఎస్ఎస్(సెంట్రల్ సెక్టార్ స్కీమ్ ఆఫ్ స్కాలర్‌షిప్స్-డిగ్రీ, పీజీ విద్యార్థులకు)
- పోస్టు మెట్రిక్ స్కాలర్‌సిప్ ఫర్ ఓబీసీ స్టూడెంట్స్

దరఖాస్తు ప్రక్రియ

ఎన్‌ఎస్‌పీ పోర్టల్‌లో విద్యార్థులు తమ దరఖాస్తులను అప్‌లోడ్ చేయాలి. ఎన్‌ఎస్‌పీ అధికారిక వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసి వన్ టైం రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. మొబైల్ నెంబర్ ఎంటర్ చేయగానే ఓటీపీ వస్తుంది. ఓటీపీ వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత విద్యార్థి వివరాలు, మెయిల్ ఐడీ, విద్యార్హతలు నమోదు చేయాల్సి ఉంటుంది. అలాగే ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, విద్యార్హతల ధ్రువపత్రాలు, బ్యాంకు ఖాతా, సంబంధిత డాక్యుమెంట్స్ అప్‌లోడ్ చేయాలి. అక్టోబర్ 31 వరకు దరఖాస్తులను పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. స్కాలర్‌షిప్ రెన్యువల్ గడువు ఆగస్టు 31 వరకు ఉంది.

11న ఎంజేపీ పాఠశాలలో ఇంటర్వ్యూలు

తిమ్మాపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు అతిథి ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఈనెల11న ఇంటర్వ్యూలు, డెమో నిర్వహించనున్నట్లు ఉమ్మడి కరీంనగర్‌జిల్లా కన్వీనర్ అంజలి ఒకప్రకటనలో తెలిపారు. జూనియర్ లెక్చరర్ జువాలజీ(మహిళ), జేఎల్, కెమిస్ట్రీ (మహిళ), జెఎల్ ఇంగ్లీష్(జనరల్), పీజీటీ మాథ్స్ (జనరల్, మహిళ), జెఎల్ మాథ్స్ (మహిళ), పీజీటీ ఫిజకల్‌సైన్స్(జనరల్, మహిళ), పీజీటీ ఇంగ్లీష్(మహిళ), టీజీటీ ఇంగ్లీష్(జనరల్) సబ్జెక్టులు బోధించుటకు అర్హులైన అభ్యర్థులు పీజీ, బీఎడ్ పూర్తిచేసి ఉండాలని తెలిపారు. ఈనెల11న తిమ్మాపూర్ మండలంలో గల మహాత్మా జ్యోతిబాపూలే బాలికలపాఠశాలలో ఉదయం 10గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

పెద్దమ్మ దేవాలయంలో చోరీ

శంకరపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరడపల్లి పెద్దమ్మతల్లి దేవాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు గ్రామస్థులు బుధవారం తెలిపారు. పెద్దమ్మ దేవాలయంలో అమ్మవారి ముక్కుపుడక, పుస్తెలు, గల్లపెట్టే అపహరణకు గురైనట్లు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

విద్యుత్ వైర్ల చోరీ

శంకరపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరడపల్లి గ్రామంలో ముగ్గురు రైతుల వ్యవసాయ బావుల వద్ద మోటర్లకు అమర్చిన విద్యుత్‌వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు రైతులు పేర్కొన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

వీర్నపల్లి ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం లాల్‌సింగ్ తండా గ్రామంలో గుడుంబా స్థావరాలపై ఎస్సై వేముల లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. మూడు లీటర్ల నాటుసారా సీజ్‌చేసి, 200లీటర్ల బెల్లం పానకంను ధ్వంసం చేశారు. నాటుసారా తయారుచేసిన భూక్య సునీత, భూక్య ధర్మలపై కేసు నమోద చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ దాడుల్లో హెచ్‌సీ లచ్చయ్య పీసీలు నవీన్, నయీంపాషా, యాకూబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గుడుంబా స్థావరాలపై దాడులు చేస్తున్న పోలీసులు

ఉద్యోగం పేరుతో డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాజన్న ఆలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగంలో పెట్టిస్తానని, అందుకు రూ2 లక్షలు కట్టాలని ఫోన్‌లో మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆలయ ఉద్యోగులు సంబంధిత వ్యక్తిపై వేములవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆడియో వైరల్‌పై దేవదాయ ధర్మదాయ రీజనల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణరావు విచారణచేసి రిపోర్టు సమర్పించాలని ఆదేశించడంతో రాజన్న ఆలయ ఈవో ఆలయంలోని ఔట్ సోర్సింగ్ సిబ్బందిని సంప్రదించి సదరు గొంతు ప్రణయన్ హౌస్‌కీపింగ్, సెక్యూరిటీ సర్వీసెస్, శాన్వి సర్వీసెస్ ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ, శివబాలాజీ కన్సల్టెన్సీ సూపర్‌వైజర్‌గా వ్యవహరిస్తున్న లక్ష్మీనారాయణదిగా భావించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఈవో పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తిమ్మాపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణికుంట గ్రామం మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకున్నట్లు ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్ బూడిద విజయ్, ట్రాక్టర్ యాజమని నోముల తిరుపతి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కరీంనగర్‌లో కార్డెన్ సెర్చ్

- 85 వాహనాలు స్వాధీనం, జరిమానా విధింపు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఒకటోఠాణా పరిధిలోని గాయత్రినగర్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో పోలీసులు బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆదేశాల మేరకు ఈ ఆపరేషన్ చేపట్టినట్లు అడిషనల్ డీసీపీ వెంకటరమణ తెలిపారు. కార్డెన్ సెర్చ్‌లో భాగంగా రెండు కాలనీలను పోలీసులు దిగ్బంధించారు. వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో మొత్తం 85 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనా లకు జరిమానా విధించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అడిషనల్ డీసీపీ వెంకటరమణ, టౌన్ ఏసీపీ వెంకటస్వామి

వివిధ అంశాలపై అవగాహన..

కార్డెన్‌సెర్చ్ అనంతరం స్థానికులకు వివిధ అంశాలపై పోలీసులు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు జరిగిన వెంటనే 1930కి కాల్‌చేయడం ద్వారా పోగొట్టుకున్న డబ్బును తిరిగి పొందవచ్చని వివరించారు. మాదకద్రవ్యాల వినియోగం, అమ్మకం చట్టరీత్యా నేరమన్నారు. వాటి దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అడిషనల్ డీసీపీ వెంకటరమణ హెచ్చరించారు. అటువంటి సమాచారం ఉంటే డయల్100కు లేదా స్థానికపోలీసులకు తెలియజేయాలని కోరారు. షీటీమ్ సీఐ శ్రీలత మాట్లాడుతూ సోషల్ మీడియాలో జరిగే మోసాలపై అమ్మాయిలను హెచ్చరించారు. అపరిచితులకు ఫొటోలు పంపవద్దని, వేధింపులకు గురైతే భయపడకుండా షీటీమ్‌ను ఆశ్రయించాలని అన్నారు. ఫిర్యాదుచేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. అంతకు ముందు డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, సీఐలు బిల్లా కోటేశ్వర్, సృజన్‌రెడ్డి, సదన్ కుమార్, శ్రీలత, పుల్లయ్య పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర సైబర్ నేరస్థుడి అరెస్ట్

- ఆరోగ్యశ్రీ పేరుతో ఆన్‌లైన్ మోసాలు
- వెల్లడించిన డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ పేరుతో ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర సైబర్‌నేరస్థుడిని అరెస్టు చేసినట్లు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన ముల్లుంటి సలీం మాలిక్(32) అనే వ్యక్తి ఢిల్లీకి చెందిన సత్యంతో కలిసి సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. సలీం మాలిక్ ఆరోగ్యశ్రీ డబ్బులు వచ్చాయని బాధితులకు ఫోన్ ద్వారా తెలిపి, ఢిల్లీలో ఉన్న సత్యంకు కాన్ఫరెన్స్ కాల్ కలపగా అతడు బాధితులకు లింక్‌లు పంపేవాడు. లింకును క్లిక్ చేయగానే బాధితుల ఖాతాలో నుంచి డబ్బులు కట్ అయ్యేవి. దీనికి సహాయపడిన సలీంమాలిక్ కొంతడబ్బులు సత్యంకు పంపించేవాడు. జిల్లాలోని ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన రాజిరెడ్డి వీరి ద్వారా రూ.46వేలు మోసపోయి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్పీ మహేష్ బి గితే ఆదేశాల మేరకు సిరిసిల్ల రూలర్ సీఐ మొగిలి సూచనలతో కేసు నమోదు చేసిన ముస్తాబాద్ ఎస్సై గణేష్ దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా సైబర్ టీం ఆర్ఎస్ఐ జునైద్, సిబ్బంది కిట్టు, గంగారెడ్డి, ముస్తాబాద్ కానిస్టేబుల్ కాసిం ప్రత్యేక టీమ్‌గా ఏర్పడి సాంకేతికత ఆధారంగా హైదరాబాద్‌లో బుధవారం నిందితుడు సలీం మాలిక్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసులో మరోనిందితుడు సత్యం పరారీలో ఉన్నాడని, త్వరలో అతన్నికూడా పట్టుకుంటామని డీఎస్పీ వెల్లడించారు. నిందితులపై తెలుగు రాష్ట్రాల్లో 79 ఫిర్యాదులు ఉన్నాయని, సుమారు రూ.60లక్షలకు పైగా ఆన్‌లైన్ మోసాలకు పాల్పడ్డారని ఆయన తెలిపారు.



సిరిసిల్లలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ చంద్రశేఖర్

పోక్సో కేసులో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా

పాలకుర్తి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్‌పోలీస్‌స్టేషన్ పరిధిలోని కన్నాలలో బాలికనువేధింపులకు గురిచేసిన కన్నం సాగర్(30)కి బుధవారం జిల్లాకోర్టుజడ్జి సునీత ఏడేళ్ల కఠినకారాగారశిక్ష, 11వేల జరిమానా విధించినట్లు బసంత్‌నగర్ ఎస్ఐస్వామితెలిపారు. కన్నాలగ్రామానికి చెందిన బాలిక బడికివెళ్లి తిరిగివస్తున్న సమయంలో ప్రేమపేరుతో సాగర్ వేధించేవాడు. బాలిక తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లగా సాగర్ బాలిక ఇంట్లోకి వెళ్లగా ఆమెకేకలు వేయడంతో సమీపంలోని ప్రజలు రావడంతో సాగర్ పారిపోయాడు. బాలిక ఇచ్చిన ఫిర్యాదుమేరకు అప్పటి ఎస్ఐ ఉమసాగర్ కేసునమోదుచేసి నిందితుడిని రిమాండ్‌కుతరలించాడని తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాదంరమేష్, పెద్దపల్లిడీజీపీ పుల్లాకరుణాకర్, ఏసీపిగజ్జికృష్ణ, సాక్ష్యులను ప్రవేశపెట్టడానికి సహకరించిన సీఐ కె ప్రవీణ్‌కుమార్, కోరు సీడీవో వెంకటేశ్వర్లు నేరస్తుడికి శిక్షపడడంలో కృషిచేశారని ఎస్ఐ తెలిపారు.

తీసుకున్న అప్పు ఇవ్వాలని ఇంటి ముందు బైఠాయింపు

గంగాధర, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తీసుకున్న అప్పు చెల్లించాలని మాజీ సర్పంచ్ ఇంటిముందు కొందరు బైఠాయించారు. గంగాధర మండలం గర్షకుర్తి మాజీసర్పంచ్ అలువాల నాగలక్ష్మి రెండేళ్ల క్రితం గ్రామంలో మన ఊరు మన బడి పనులు చేపట్టారు. ఇందుకోసం గ్రామంలో కొందరి వద్ద అప్పుతీసుకున్నాడు. పనులు పూర్తి చేసి రెండు సంవత్సరాలు దాటినా బిల్లులు రాకపోవడంతో ఆయన అప్పు చెల్లించలేదు. బుధవారం సర్పంచ్ కుటుంబ సభ్యులు బంధువుల ఫంక్షన్‌కు వెళ్లి వచ్చేసరికి అప్పులిచ్చిన వారు డబ్బు చెల్లించాలని ఇంటిముందు భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో సర్పంచ్ గంగాధర పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాకు పనులు చేసినవి 12లక్షలు రావాల్సి ఉందని రాగానే ఇస్తానని చెప్పిన వినిపించుకోలేదని నాకు బిల్లులు వచ్చేంత వరకు గంగాధర చౌరస్తాలో ధర్నాకు దిగుతానని పోలీసులకు తెలిపారు. దీంతో పోలీసులు ఆయనను సముదాయించి ఇంటికి పంపించారు.

అక్రమ ఇసుకను గుర్తించిన పోలీసులు

ధర్మారం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాయంపేట గ్రామంలో అక్రమంగా డంప్‌చేసిన ఇసుకను పోలీసులు గుర్తించారు. శాయంపేట శివారులోని ప్రభుత్వభూమి సర్వేనంబర్ 84లో గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా ఇసుక నిల్వ చేశారన్న సమాచారం మేరకు బుధవారం ఎస్ఐ ప్రవీణ్ కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అక్రమంగా నిల్వ ఉన్న దాదాపు 15 ట్రిప్పుల ఇసుకకు సంబంధించిన తదుపరి చర్యల నిమిత్తం రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. ఇసుకను రెవెన్యూ అధికారులు సీజ్‌చేశారు. శాయంపేట పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం వేలం వేయనున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ ఉదయ్ కుమార్ తెలిపారు. ఆసక్తిగల వ్యక్తులు ఉదయం 10గంటలకు గ్రామపంచాయతీ వద్ద జరిగే వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు.

ఇసుక డంపును స్వాధీనం చేసుకున్న పోలీసులు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారం గ్రామశివారు హనుమాన్‌గుడి వద్ద అక్రమంగా నిల్వఉన్న ఇసుక డంపును బుధవారం పోలీసులు గుర్తించారు. ఈమేరకు వారు డంపులను పరిశీలించి, స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఇసుక సరఫరాపై తహసీల్దార్ అధ్యక్షతన పోలీస్‌స్టేషన్‌లో ఇసుకవ్యాపారులు, ట్రాక్టర్ యజమానులతో సమావేశం నిర్వహించిన మరుసటి రోజునే పెద్ద మొత్తంలో ఇసుక డంపును గుర్తించడం చర్చనీయాంశంగా మారింది.

గుట్టుచప్పుడు కాకుండా కల్తీమద్యం తయారీ

- బ్రాండెడ్ మద్యం సీసాల్లో చీప్ లిక్కర్ నింపి విక్రయం
- ఇద్దరిని అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు

వేములవాడ టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బ్రాండెడ్ మద్యం సీసాల్లో చీప్ లిక్కర్‌ని నింపి విక్రయిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వేములవాడ పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో సీఐ రాజశేఖర్‌రావు వివరాలను వెల్లడించారు. వేములవాడ మండలంలోని రుద్రవరం ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన తునికి కార్తీక్ బ్రాండెడ్ కంపెనీలకు చెందిన ఖాళీ మద్యంసీసాలను సేకరించి వాటిలో చీప్‌లిక్కర్ నింపి స్థానికంగా విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో నమ్మదగిన సమాచారం మేరకు బుధవారం సాయంత్రం కార్తీక్ ఇంటికి వెళ్లి తనిఖీలు నిర్వహించగా ఖాళీనీళ్ల సీసాలలో నింపిన మద్యంతో పాటు పలు బ్రాండెడ్ సీసాల్లో నింపిన మద్యం లభించిందన్నారు. కార్తీక్‌ను విచారించగా వేములవాడ పట్టణానికి చెందిన దామరపల్లి సంతోష్ అనే మరోయువకుడి సాయంతో 6నెలలుగా ఈ అక్రమ దందా నిర్వహిస్తున్నట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. దీంతో ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని కార్తీక్ వద్ద నుంచి 9రెండు లీటర్ల వాటర్ బాటిల్స్, మరో 9లీటర్ వాటర్ బాటిల్స్, 3సిగ్నేచర్ బాటిల్స్‌లోని మద్యాన్ని, సంతోష్ వద్ద గల 750 మిల్లీలీటర్ల పరిమాణంలో 3సిగ్నేచర్, 3 విలయమ్సన్, ఐబీ, ఆర్సీ, రెడ్‌లేబుల్, రాయల్ గ్రీన్ ఒక్కో బాటిల్స్‌తో పాటు మరో అరలీటర్ మద్యం బాటిల్స్‌తోకలిపి సుమారుగా రూ.50 వేల విలువగల మద్యాన్ని సీజ్ చేశారు. గత 6 నెలలుగా సుమారు రూ.2 లక్షల వ్యాపార లావాదేవీలు కొనసాగించినట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు. ఇద్దరిని కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు సీఐ పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సై రవి, టాస్క్‌ఫోర్స్ ఎస్సై శైలజ సిబ్బంది ఉన్నారు.



నిందితులను అరెస్టు చూపుతున్న ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు

కరెంటు కోతలపై రైతుల కన్నెర్ర

- రోడ్డుపై బైఠాయించి ఆందోళన

గంభీరావుపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కరెంటు కోతలపై రైతుల కన్నెర్ర చేశారు. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడటంతో పంటలు ఎండిపోతున్నాయంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. గంభీరావుపేట మండలం కొత్తపల్లి విద్యుత్‌సబ్‌స్టేషన్ పరిధిలోని రాజుపేట, కొత్తపల్లి, కోళ్ళమద్ది శ్రీగాధ గ్రామాలకు చెందిన రైతులు కరంటు కోతలపై బుధవారం ఆందోళన చేపట్టారు. సెస్ ఏఈ అక్కడికి చేరుకుని వారం రోజుల్లో విద్యుత్ సమస్య లేకుండా చూస్తానని హామీఇవ్వడంతో రైతులు శాంతించారు. ఆందోళనలో రైతులతోపాటు కొత్తపల్లి సింగిల్‌విండోఛైర్మన్ భూపతిసురెందర్, మాజీసర్పంచ్‌లు అల్లె సత్యం, నాగరాజుగౌడ్, మాజీ ఉపసర్పంచ్ మహేష్, గౌసొద్దీన్, సత్యం, సుదాకర్, రమేష్, నరేష్,కిషన్,రాజు,ఎల్లారెడ్డి,సుదర్శన్ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామశివారులోని గుడిసెలో అక్రమంగా నిల్వచేసిన 10క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి బుధవారం తెలిపారు. కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన నర్రావుల కొమురయ్య కొంతకాలంగా అక్కపల్లి గ్రామంలో నివసిస్తున్నాడు. పీడీఎస్ బియ్యం నిల్వ చేశాడనే సమాచారంతో సోదాచేయగా 10క్వింటాళ్ల లభించాయని చెప్పారు. బియ్యాన్ని స్వాధీనపర్చుకుని కొమురయ్యపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు

తిమ్మాపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణకాలనీ గ్రామం వద్ద రాజీవ్‌రహదారిపై బుధవారం రాత్రి పెనుప్రమాదం తప్పింది. హైదరాబాద్‌వైపు నుంచి కరీంనగర్‌వైపు వెళుతున్న ఓ కారు రామకృష్ణాకాలనీ వద్ద రాజీవ్‌రహదారిపై అదుపుతప్పి రోడ్డుమధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొంటూ కరీంనగర్ నుంచి హైదారాబాద్ వైపు వెళుతున్న మరో కారును ఢీకొంది. ఈప్రమాదం జరిగినవెంటనే అటునుంచి హైదారాబాద్ వెలుతున్న ఆర్టీసీ బస్సును డ్రైవర్ ఒక్కసారిగా నిలిపేశాడు. దాని వెనుకల నుంచి మినీగూడ్స్ ట్రక్కు వేగంగావచ్చి బస్సులను ఢీకొంది. దీం తో బస్సు మినీట్రక్కురోడ్డుపై ఇరుక్కుపోయాయి. దీంతో దాదాపు కిలోమీటర్‌కు పైగావాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బ్లూకోట్స్ సిబ్బంది స్థానికులసహాయంతో ట్రాఫిక్‌ను క్రమ బద్ధీకరించారు. ఈప్రమాదంలో మాధవి అనేమహిళ స్వల్పగాయాలతో బయటపడింది.

మావోయిస్టు అగ్రనేత మల్లా రాజిరెడ్డికి అరెస్టు వారెంట్ జారీ

మంథని, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుపార్టీ కేంద్రకమిటీసభ్యుడు మల్లా రాజిరెడ్డిపై ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లా సెషన్స్‌కోర్టు అరెస్టు వారెంట్ జారీచేసింది. పెద్దపల్లిజిల్లా మంథని మండలం శాస్త్రులపల్లి మల్లారాజిరెడ్డి స్వగ్రామం. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ ఎస్ఐ ఆర్‌కేసేతియా, కానిస్టేబుల్ మనోహర్ కోర్టువారెంట్‌తో బుధవారం శాస్త్రులపల్లికి వచ్చారు. మల్లా రాజిరెడ్డి అజ్ఞాతంలో ఉండడం, ఇంట్లో ఎవరూ లేకపోవడంతో అరెస్ట్‌వారెంట్‌ను స్థానికపోలీసుల సహాయం తో ఇంటితలుపునకు అంటించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో అరెస్టు వారెంట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఆర్‌కే సేతియా మాట్లాడుతూ మల్లారాజిరెడ్డిపై క్రైం నెం.09/25ప్రకారం వివిధసెక్షన్లకింద కేసులు బీఎన్ఎస్ 191(2),191(3),190,109, బీఎన్ఎస్ 25,27, ఆంసెంట్13,38(2), 39(2) యూఏపీఏ సెక్షన్లకింద కేసులు నమోదయ్యా యని, వీటిపై కాంకేర్ సెషన్స్ కోర్టు వారెంట్‌జారీ చేసిందన్నారు. సెప్టెంబర్ 11న మల్లా రాజిరెడ్డి కాంకేర్‌సెషన్స్ కోర్టులోహాజరు కావాలన్నారు.



శాస్త్రులపల్లిలో రాజిరెడ్డి ఇంటికి వారెంట్ అంటిస్తున్న ఛత్తీస్‌గఢ్ పోలీసులు

జంతర్‌మంతర్ వద్ద ధర్నాలో మంత్రులు




ధర్నాలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్, శ్రీధర్‌బాబు, సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఒడితెల ప్రణవ్

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు మద్దతుగా రాహుల్ గాంధీ నాయకత్వంలో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద బుధవారం చేపట్టిన ధర్నాలో జిల్లా మంత్రులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వివేక్, ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, హుజూరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఒడితెల ప్రణవ్‌బాబు, టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, పత్తి కృష్ణారెడ్డి, మునిగంటి అనిల్‌కుమార్, పొన్నం సత్యం, బోనాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారార్ అధ్యాపకులకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి

గణేశ్‌నగర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ ప్రభుత్వ అటనామస్ కళాశాల కామర్స్ విభాగానికి చెందిన అధ్యాపకులు డాక్టర్ ఎం.మల్లారెడ్డి తెలుగు విభాగాధిపతి డాక్టర్ బూర్ల చంద్రశేఖర్, మైక్రో బయాలజీ విభాగాధిపతి డాక్టర్ బి.సతీష్ కుమార్‌కు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పిస్తూ కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ తెలిపారు. కెరియర్ అడ్వాన్స్‌మెంట్ స్కీంలో భాగంగా పదోన్నతి పొందినట్లు చెప్పారు. ఈ సందర్భంగా అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందిన అధ్యాపకులను ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పాఠక్, రాజయ్య, టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్‌రెడ్డి, స్టాఫ్ క్లబ్ సెక్రెటరీ డాక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు అభినందించారు.

హోటల్‌లో ఫుడ్ పాయిజన్

బాలుడికి అస్వస్థత

జగిత్యాల, అర్బన్, ఆగస్టు 6 (ఆంధ్ర జ్యోతి): జగిత్యాల పట్టణంలోని తహసీల్ చౌరస్తా సమీపంలో ఉన్న శివసాయి హోటల్‌లో బుధవారం ఫుడ్ పాయిజన్‌తో విక్రాంత్ అనే బాలుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. బుధవారం హోటల్‌లో దోశ తిన్న విక్రాంత్ అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాలుడు ఫుడ్ పాయిజన్‌కు గురైనట్లు వైద్యులు తెలిపారని బాలుడి కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. కాగా గతంలోనూ శివసాయి హోటల్‌లో ఫుడ్ పాయిజన్ జరగగా పలువురు అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు దానిని సీజ్ చేశారు. కానీ రెండు, మూడు రోజులకే మళ్లీ హోటల్‌ను తెరిచి నడిపిస్తున్నారు. తాజాగా బుధవారం హోటల్‌లో మరోసారి బాలుడికి ఫుడ్ పాయిజన్ కావడంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై పలు విమర్శలు వస్తున్నాయి.

నేటి నుంచి ఎస్సారెస్పీ నీటి విడుదల



- అన్నదాతలకు శుభవార్త చెప్పిన శివం కమిటీ
- వారబందీ పద్ధతిలో సరఫరా
- ఊపందుకోనున్న వానాకాలం పంటల సాగు

జగిత్యాల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వానాకాలం పంటల సాగుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడానికి షెడ్యూల్ ఖరారైంది. ఎస్సారెస్పీ నీటి విడుదల కోసం ఎదురుచూస్తున్న రైతాంగానికి శివం కమిటీ సమావేశం శుభవార్త చెప్పింది. బుధవారం హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగిన రాష్ట్ర స్థాయి సమీకృత నీటి ప్రణాళిక యాజమాన్య కమిటీ (ఎస్‌సీఐడబ్ల్యూఏఎం) సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. గురువారం నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వారాబందీ పద్ధతిలో నీటిని సాగు కాలువలకు విడుదల చేయనున్నారు.

ఎస్సారెస్పీ జోన్-1 కింద గల డిస్ట్రిబ్యూటరీ కాలువ 1 నుంచి 53వ డిస్ట్రిబ్యూటరీ వరకు మొదటి ఏడు రోజులు నీటిని విడుదల చేస్తారు. ఎస్సారెస్పీ జోన్-2 కింద గల డిస్ట్రిబ్యూటరీ కాలువ 54 నుంచి 94 డిస్ట్రిబ్యూటరీ వరకు తదుపరి ఏడు రోజులు నీటిని విడుదల చేయనున్నారు. ఇలా వారాబందీ పద్ధతిలో వానాకాలం పంట సాగు ముగిసే వరకు అవసరమైన నీటిని అన్నదాతలకు అందించడానికి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారులు ప్రణాళిక రూపొందించారు.



● నేడు కాకతీయ కాలువకు...

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటిని గురువారం ఉదయం 11 గంటలకు కాకతీయ కాలువకు విడుదల చేయనున్నారు. అదేవిధంగా లక్ష్మీ కాలువ, సరస్వతీ కాలువలు, ఎత్తిపోతల పథకాలకు సైతం నీటిని విడుదల చేయనున్నారు. గత యేడాది సైతం ఆగస్టు మొదటి వారంలో శ్రీరాంసాగర్ నీటిని వారాబందీ పద్ధతిలో విడుదల చేశారు. ఎస్సారెస్పీ అధికారులు ఇచ్చిన నివేదికకు అనుగుణంగా కాకతీయ కాలువకు 5 వేల క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 350 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 900 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 550 క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడానికి నిర్ణయించారు.

వర ప్రదాయిని శ్రీరాంసాగర్..

జిల్లాలో రెండు మండలాలు మినహా మిగిలిన ప్రాంతాల్లో శ్రీరాంసాగర్ కాకతీయ కాలువ ఆయకట్టు పరిధిలో ఉంది. జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి, కొడిమ్యాల వంటి మండలాలకు ఎస్సారెస్పీ వరద కాలువ ద్వారా సాగు నీరు అందుతోంది. జిల్లా రైతాంగానికి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరప్రదాయినిగా ఉంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద జగిత్యాల జిల్లాలో సుమారు 3 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కాగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సుమారు 1.60 లక్షలు, ఆదిలాబాద్‌లో 1.45 లక్షలు, కరీంనగర్‌లో 6.72 లక్షలు, వరంగల్‌లో 4.71 లక్షలు, ఖమ్మంలో 1.28 లక్షలు, నల్లగొండలో 2.87 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. జగిత్యాల జిల్లాలో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 4.50 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారన్న అంచనా ఉంది. ఇందులో వరి 3.5 లక్షల ఎకరాలకు పైగా సాగు అవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు.

ఆయకట్టు రైతుల ఆశలు సజీవం..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు రైతుల ఆశలు సజీవంగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టును 1983లో జాతికి అంకితం చేశారు. అప్పటి నుంచి ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నారు. మాన్యువల్ ఆధారంగా ప్రాజెక్టు గేట్లను నిర్మాణం చేశారు. ప్రాజెక్టుకు వరదలు వచ్చే సమయంలో పెద్ద మొత్తంలో వరద వచ్చి చేరుతోంది. ఆ సమయంలో ప్రాజెక్టులోని మొత్తం 42 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తారు.

కాగా ఇటీవల మహా రాష్ట్రలోని గోదావరి నదిపై ప్రాజెక్టు ఎగువన నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను కొన్ని రోజుల క్రితం ఎత్తారు. దీంతో గోదావరి ఎగువ ప్రాంతం నుంచి నీరు వస్తోంది. దీనికి తోడు మహారాష్ట్రలోని విష్ణుపురి, అంబూరా, బాలేగావ్ ప్రాజెక్టులో నిండుగా ఉండడంతో దిగువకు నీటిని వదులుతున్నారు. దీంతో నీటి మట్టం పెరుగుతోంది. ప్రస్తుతం డ్యామ్‌లో నిల్వ ఉన్న నీటికి తోడు మరో ఒకటి, రెండు టీఎంసీల నీరు వచ్చి చేరితే ఆయకట్టు వానాకాలం పంటలకు ఢోకా ఉం డదని రైతులు ఆశతో ఉన్నారు. 45 టీఎంసీల నీరు ఉంటే తాగునీటి అవసరాలు, ఆవిరి రూపంలో పోయే నీటి లెక్కలు కలుపుకొని వానాకాలంలో ప్రాజెక్టు ఆయకట్టుకు నీరు సరఫరా చేపడుతారని సంబంధిత వర్గాలు అంటున్నాయి.

ప్రాజెక్టులో ప్రస్తుత నీటి పరిస్థితి ఇలా..

ఎస్సారెస్పీలోకి వరద నీరు రావడం బుధవారం కొనసాగింది. డ్యామ్‌లోకి 2,620 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరింది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకుగాను ప్రస్తుతం 40.582 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 793 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇదిలా ఉండగా జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజె క్టు లోకి 31.552 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 3.757 టీఎంసీల నీరును వ్యయం చేశారు.

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకే..: శ్రీనివాస్‌రావు, ఎస్ఈ, పోచంపాడ్ ప్రాజెక్టు



ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రస్తుత వానాకాలం పంటల సాగుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడానికి నిర్ణయించాం. హైదరాబాద్‌లో జరిగిన శివమ్ కమిటీ సమావేశంలో సాగు నీటి విడుదల ప్రణాళికను ఖరారు చేశారు. గురువారం నుంచి ఎస్సారెస్పీ నీటిని కాలువల ద్వారా వారాబందీ పద్ధతిలో విడుదల చేయనున్నాం.

నీటి విడుదలను స్వాగతిస్తున్నాం : మహేందర్‌రెడ్డి, రైతు సంఘం నాయకుడు, జగిత్యాల



వర్షాకాలం పంటలకు శ్రీరాంసాగర్ నీటి విడుదల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ప్రస్తుతం కొందరు రైతులు నార్లు పోయడం, నాట్లు వేయడం వంటి పనులు పూర్తి చేసి కాలువల నీటి కోసం ఎదురు చూస్తున్నారు. సరియైన సమయంలో నీటి విడుదల నిర్ణయం తీసుకోవడం హర్షణీయం.

10న ఉమ్మడి జిల్లాస్థాయి ఆహ్వానిత ఖో-ఖో పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10న ఉమ్మడి జిల్లా స్థాయి ఆహ్వానిత ఖో-ఖో పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేం దర్‌రావు తెలిపారు. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 8 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. పోటీల్లో సిరిసిల్ల జిల్లా నుంచి రెండు, పెద్దపల్లి జిల్లా నుంచి రెండు, జగిత్యాల జిల్లా నుంచి రెండు, కరీంనగర్ జిల్లా నుంచి రెండు జట్లు చొప్పున పాల్గొనవచ్చని తెలిపారు.

సిరిసిల్ల క్రీడాకారులు ఎస్కే మోయినుద్దీన్‌ను, పెద్దపల్లి జిల్లా క్రీడాకారులు డాక్టర్ వేల్పుల కుమార స్వామిని, జగిత్యాల క్రీడాకారులు డాక్టర్ ఎ.రవీందర్, కరీంనగర్ జిల్లా క్రీడాకారులు వి.సూర్య ప్రకాష్‌ను సంప్రదించాలని సూచించారు. పోటీల్లో పాల్గొనే జట్లకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించినట్లు తెలిపారు. పురుషుల విభాగంలో నిర్వహించనున్న ఈ పోటీలతో పాటు ఉదయం 10 గంటలకు ఉమ్మడి జిల్లా ఖో-ఖో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఉంటుందని కార్యదర్శి తెలిపారు.

బీసీ రిజర్వేషన్లపై ఢిల్లీలో కాంగ్రెస్ డ్రామా..

- 10శాతం ముస్లిం రిజర్వేషన్ తీసివేస్తే మద్దతు...
- కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే ఓబీసీని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించాలి...
- కాళేశ్వరం అవినీతితో ఆ నలుగురే...
- ఈటల ప్రమేయం ఉండదు...
- తుమ్మిడి హెట్టితో ఉమ్మడి ఆదిలాబాద్‌కు నీళ్లు ఇవ్వాలి..
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

గోదావరిఖని, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై రాహుల్‌గాంధీ డైరక్షన్‌లో ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ డ్రామాలు చేస్తుందని, నాయకులు యాక్టర్లుగా, పెయిడ్ ఆర్టిస్టులుగా మారారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆరోపించారు. బుధవారం గంగానగర్‌లో బీజేపీ నాయకుడు అమరేందర్‌రావు నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీలో బిల్లు పెట్టి కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ చేసి ఇప్పుడు ఢిల్లీకి ఎందుకు వెళ్లారని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు డ్రామాలు ఆడుతున్నారన్నారు.

అసెంబ్లీలో 42శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెడతామని బీజేపీకి చెందిన 8మంది ఎమ్మెల్యేలు మద్దతు ఇచ్చారని, తరువాత 42 శాతం రిజర్వేషన్‌లో 10శాతం ముస్లింలకు ఇస్తామని చెబుతున్నారని, దీంతో అసలైన బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. గతంలో వైఎస్‌ఆర్ హయాంలో ముస్లింలకు 4శాతం రిజర్వేషన్ ఇస్తేనే వివాదం జరిగిందని, కోర్టులో వివాదం ఇంకా కొనసాగుతుందన్నారు. ఓబీసీల్లో బీజేపీకి పెరుగుతున్న మద్దతును తట్టుకోలేక బీజేపీని బీసీలకు దూరం చేసేందుకు బీసీ బిల్లు పేర కాంగ్రెస్ కుట్ర చేస్తుందన్నారు. ముస్లిం రిజర్వేషన్లను తీసివేస్తే తాము మద్దతు ఇస్తామని పేర్కొన్నారు. రాహుల్ కుటుంబం నుంచి ప్రధాని అభ్యర్థి ఎవరు ఉండరని, ఓబీసీలే తమ ప్రధాని అభ్యర్థి అని కాంగ్రెస్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిలో కేసీఆర్ కుటుంబానికి చెందిన నలుగురే బాధ్యులని, ఈటలకు సంబంధం ఉండదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నిపుణులను, ఐఏఎస్ అధికారులను ఎవరిని పరిగణలోకి తీసుకోలేదన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కట్టి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాలకు నీరు ఇవ్వాలనే బీజేపీ డిమాండ్ అన్నారు. రాష్ట్రంలో రైతాంగానికి అవసరమైన యూరియాను కేంద్రం అందిస్తుందని, రాష్ట్రంలో మాత్రం బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తుపెట్టుకోబోమని, గెలుపు గుర్రాలకే టికెట్లు ఇస్తామన్నారు. ఎస్‌సీ మోర్చ కార్యదర్శి ఎస్ కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, మాజీ ఎంపీ వెంకటేష్‌నేత, గోమాస శ్రీనివాస్, కాసిపేట లింగయ్య, రావుల రాజేందర్, బల్మూరి వనిత, కందుల సంధ్యారాణి, సోమారపు లావణ్య, మేరుగు హన్మంతుగౌడ్, మనోహర్‌రెడ్డి, పాల్గొన్నారు.

రచయితకు సమగ్ర దృష్టి ఉండాలి

- జస్టిస్ చంద్రకుమార్
- విమలక్కకు జయశంకర్ స్ఫూర్తి పురస్కారం

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రచయితకు సమ్యక్ సమగ్ర దృష్టి ఉండాలని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో డికె ఫౌండేషన్ చైర్మన్ దేవరకొండ కాళిదాసు పురస్కార ప్రదాతగా ప్రతియేటా ప్రదానం చేసే ఆచార్య కొత్తపల్లి జయశంకర్ స్మారక రాష్ట్ర స్థాయి స్ఫూర్తి పురస్కారాన్ని 2025 సంవత్సరానికి బుధవారం కరీంనగర్ ఫిలింభవన్‌లో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్కకు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ మానవీయ విలువలను పెంపొందించేందుకు కవులు, రచయితలు తమ కలాల్ని, గళాల్ని ఎక్కు పెట్టాలని అన్నారు. నాలుగు దశాబ్దాలుగా అవిశ్రాంత పోరుబాటగా ప్రతిధ్వనిస్తున్న విమలక్కకు పురస్కారం ప్రదానం చేయటం సముచితంగా ఉందని అన్నారు.

విమలక్క మాట్లాడుతూ తన పోరుబాటకు ఈ పురస్కారం తగిన గుర్తింపుగా భావిస్తున్నానన్నారు. తెరవే రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి, బూర్ల వేంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సీవి కుమార్, దామరకుంట శంకరయ్య, డాక్టర్ నలిమెల భాస్కర్, పొన్నం రవిచంద్ర, గాజోజు నాగభూషణం, అన్నవరం దేవేందర్, నగునూరి శేఖర్, కందుకూరి అంజయ్య, సదాశ్రీ తెలంగాణ ఉద్యమకారులు, అభిమానులు పాల్గొన్నారు.




విమలక్కకు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ స్ఫూర్తి పురస్కారాన్ని అందజేస్తున్న హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, తెరవే ప్రతినిధులు, మాట్లాడుతున్న చంద్రకుమార్

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

16 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

జగిత్యాల క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా దొంగను జగిత్యాల పట్టణ పోలీసులు అరెస్టు చేసి 16 తులాల బంగారు నగలతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం డీఎస్పీ రఘుచందర్ వివరాలు వెల్లడించారు. రాయికల్ మండలం అయోధ్య గ్రామానికి చెందిన అత్తినేని చంద్రమోహన్(29) జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తున్నాడు. శంకులపల్లి శివారులో బుధవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా చంద్రమోహన్ పారిపోయే ప్రయత్నం చేయగా పట్టుకున్నారు. విచారణలో ఇటీవల జిల్లాలో పలు ప్రాంతాల్లో ఏడు చోట్ల దొంగతనాలకు పాల్పడ్డ వ్యక్తి చంద్రమోహన్‌గా గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ వివరించారు. చంద్రమోహన్‌పై పలు జిల్లాల్లో 25 క్రిమినల్ కేసుల తో పాటు పీడీ యాక్ట్ కింద జైలుకు సైతం వెళ్లివచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఐ కరుణాకర్, ఎస్సై సుప్రియ ఉన్నారు.

సౌదీ నుంచి వస్తూ గుండెపోటుతో యువకుడి మృతి

ముంబైలో విమానం అత్యవసర ల్యాండింగ్




శ్రీధర్ (ఫైల్)

కోరుట్ల రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సౌదీ నుంచి స్వస్థలానికి వస్తూ కోరుట్లకు చెందిన శ్రీ రాముల శ్రీధర్ (46) గుండె పోటుతో బుధవారం తెల్లవారు జామున మృతిచెందాడు. శ్రీరాముల శ్రీధర్ ఎనిమిది నెలల క్రితం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. బుధవారం తెల్ల వారుజామున సౌదీ నుంచి హైదరాబాద్‌కు విమానంలో వస్తుండగా మార్గమధ్యలో గుండె పోటు వచ్చింది. దీంతో విషయాన్ని విమాన సిబ్బందికి తెలపగా వారు వెంటనే ముంబైలో విమానాన్ని అత్య వసర ల్యాండింగ్ చేశారు. డాక్టర్లు అతడికి సీపీఆర్ చేయగా ఎలాంటి చలనం లేకపోవడంతో మరణించాడని ధ్రువీకరించారు. మృతుడికి భార్య వీణ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు పమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రంగంపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై లక్ష్మన్‌రావు తెలిపారు. 35 నుంచి 40 ఏళ్ల వయస్సు, కుడి ఛాతి మీద త్రిశూలం డమరుకం పచ్చ బొట్టు, ఎడమ భుజంపై త్రిశూలం, కుడి చేతి పై గిటార్, కత్తి, పూలతో కూడిన పచ్చబొట్లు ఉన్నాయన్నారు. మృతదేహన్ని పెద్దపెల్లి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురిలో భద్రపరిచామని తెలిపారు. సమాచారం తెలిసిన వారు పెద్దపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై 87126 56506, సీఐ 8712656505 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఊసే లేని ఆర్టీసీ విలీనం

- కార్మికుల ఎదురు చూపులు
- ఉద్యోగుల్లో అభద్రతా భావం
- యూనియన్లు లేక అటకెక్కిన డిమాండ్లు

భగత్‌నగర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ విలీన ప్రక్రియ ఊసే లేకుండా పోయింది. ప్రభుత్వంలో ఆర్టీసీతో పాటు, ఆ సంస్థ ఉద్యోగుల విలీన ప్రక్రియపై రాష్ట్ర ప్రభుత్వం నాన్చుడు ధోరణి అవలంబిస్తోందని కార్మికులు అభిప్రాయపడుతున్నారు. కరీంనగర్ రీజి యన్ వ్యాప్తంగా కరీంనగర్-1, కరీంనగర్-2, మెట్ పల్లి, కోరుట్ల, జగిత్యాల, వేములవాడ, సిరిసిల్ల, హుస్నాబాద్, మంథని, గోదావరిఖని డిపోలు ఉన్నాయి. గత ప్రభుత్వం విలీన ప్రక్రియను తెరపైకి తీసుకొచ్చి అసెంబ్లీలో బిల్లు ఆమోదించి గవర్నర్‌కు పంపించింది. ఆ తర్వాత బిల్లుకు ఆమోద ముద్ర పడినా ఎన్నికల కోడ్‌తో ఆ తతంగం నిలిచి పోయింది.

కాంగ్రెస్ ఆర్టీసీని, కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చినా విలీన అంశాన్ని మాత్రం పట్టించుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులతో ఇప్పటికి వరకు చర్చలపై ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. గత ప్రభుత్వంతోపాటు ప్రస్తుత ప్రభుత్వం విలీనంపై ప్రణాళికను సిద్ధంచేయక పోవడంతో విలీనం ఉంటుందా లేదా అని ఉద్యోగ, కార్మికులు సందిగ్ధంలో ఉన్నారు.

ఉద్యోగుల్లో అభద్రతా భావం

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాడ్డాక హామీల అమలులో భాగంగా మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడుస్తున్నా విలీన ప్రక్రియపై చర్చలు నిర్వహించక పోవడం, నిర్ణయం తీసుకోక పోవడంతో కార్మికులు అసహనానికి గురవుతున్నారు. ఉద్యోగుల హక్కుల కోసం కొద్ది రోజుల క్రితం ఆర్టీసీ కార్మికులు దశల వారీగా ఆందోళనలు చేపట్టారు. కొన్ని సంఘాలు సమ్మెకు సైతం పిలుపునివ్వడం, ఆ తర్వాత నాయకులు యూనియన్లతో చర్చించడం, సమ్మె నిలిపి వేయడం వంటివి చోటు చేసుకున్నాయి. విలీన ప్రక్రియ నిర్వహించక పోవడంతో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ఉద్యోగ భద్రతపై అభద్రతా భావంతో కొట్టుమిట్టాడుతన్నారు.

అటకెక్కిన డిమాండ్లు

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో యూనియన్లు లేకపోవడంతో ఆర్టీసీ కార్మికుల డిమాండ్లన్నీ అటకెక్కాయని కార్మికులు వాపోతున్నారు. ప్రధానంగా కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు, 2021 పేస్కేల్, ఉద్యోగ భద్రత, యూనియన్‌ల పునరుద్ధరణ, రిటైర్ ఉద్యోగులకు 2017 పేస్కేల్ బకాయిలు, కార్మికుల నియమకాలు రెగ్యులర్ ప్రాతిపదికన చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి నిర్వహించాలంటున్నారు. అదే విధంగా కార్మికులపై ఉన్న పనిభారాన్ని తగ్గించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూపు

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ నిర్ణయం కోసం కార్మికులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ విలీన ప్రక్రియను అంశాన్ని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పూర్తి చేయాల్సిన అవసరం ఉందని కార్మికులు అంటున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ముగ్గురికి గాయాలు

వెల్గటూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం కప్పారావుపేట దగ్గర బుధవారం ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో బైక్‌తో పాటు యువకుడు బస్సు కిందికి చొచ్చుకుపోగా అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం టీఎస్ 19 జడ్ 0029 నంబరు గల మంచిర్యాల డిపో సూపర్ లగ్జరీ ఆర్టీసీ బస్సు కరీంనగర్ నుంచి మంచిర్యాల వైపు వస్తోంది. బస్సు కప్పారావుపేట మసీదు వద్దకు వస్తున్న క్రమంలో ఓ స్కూల్ బస్సు కిషన్‌రావుపేటకు వెళ్లడానికి కుడివైపు తిరుగుతుండగా వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ స్కూల్ బస్సును తప్పించే క్రమంలో ఎదురుగా పాశిగామకు చెందిన కాంద్రపు మహేష్, రాయపట్నంకు చెందిన పోతరాజుల కమలాకర్, పిట్టల చందులు వస్తున్న టీజీ 21 4853 నంబరు గల ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న మహేష్ బైక్‌తో పాటు బస్సు కిందికి చొచ్చుకు పోయాడు. మరో ఇద్దరు రోడ్డుపై పడిపోయారు. క్షత గాత్రులను పోలీసులు ఆసుపత్రికి తరలించారు.



ఘటనా స్థలంలో క్షతగాత్రులు

బదిలీపై వెళుతున్న ఏపీఎంకు సన్మానం

ఇల్లంతకుంట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయిలో మండల సమాఖ్యకు మంచి గుర్తింపు రావడానికి అంకితభావంతో పనిచేయడమే కారణం అని ఎంపీడీవో శశికళ పేర్కొన్నారు. మండల సమాఖ్య భవనంలో బుధవారం బదిలీ అయిన ఏపీఎం వాణిశ్రీకి వీడ్కోలు సమావేశం జరిగింది. నూతన ఎంపీవోగా బాధ్యతలు స్వీకరించిన లతామంగేశ్వరికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్ఎస్ అధ్యక్షురాలు కట్ట సౌమ్య, కార్యదర్శి మమత, కోశాధికారి సరస్వతి, సీసీలు రాంచంద్రారెడ్డి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలి

ఇల్లంతకుంట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వైద్యసిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని జాతీయ మానవ హక్కుల కమిటీ మండల చైర్మన్ కాసుపాక శ్రీనివాస్ కోరారు. మండలకేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలో గతంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఉండగా ప్రస్తుతం పల్లె దవాఖానాలో కొనసాగుతోందన్నారు. వైద్యసిబ్బంది సాయంత్రం వరకు మాత్రమే ఆసుపత్రిలో ఉంటున్నారని, రాత్రి సమయంలో ఇబ్బంది అవుతుందన్నారు. అధికారులు స్పందించి నిరుపేదలు ప్రభుత్వ ఆసుపత్రి పరిస్థితిని మార్చాలని కోరారు. మండల ప్రధాన కార్యదర్శి పినకాసి మనోహర్, సహాయకార్యదర్శులు నారెడ్డి రాజశేఖర్, కాసుపాక బాబు, సోషల్‌మీడియా ఇంచార్జ్ తిప్పారపు బ్రహ్మచారి తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



పరామర్శిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల్లో గాయ పడిన విద్యార్థితో పాటు కార్యకర్తకు మెరుగైన వైద్యం అందించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో ఇటీవల జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో గాయపడి చికిత్స పొందుతున్న పదో తరగతి విద్యార్థి హర్షద్, బీఆర్ఎస్ కార్యకర్త దేవేందర్‌లను బుధవారం ఆయన పరామర్శించారు. ఆసుపత్రిలోని విద్యార్థి హర్షద్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అంతకుముందు రాచర్లబొప్పాపూర్‌లోని దేవేందర్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. తిరుపతిరెడ్డి, లక్ష్మారెడ్డి, గణేశ్, నరేశ్, రాజిరెడ్డి, సత్యంరెడ్డి, బాలకృష్ణ, కిరణ్‌నాయక్, లక్ష్మణ్, ప్రశాంత్, రంజిత్, రాంరెడ్డి, కార్తీక్, వినయ్, శ్రీనివాస్, బాల్‌రెడ్డి, తిరుపతి, కిష్టయ్య ఉన్నారు.

మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలిగా పుష్పలత

ఇల్లంతకుంట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలుగా తీగల పుష్పలత నియామకం అయ్యారు. జిల్లాకేంద్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత నియామక పత్రాన్ని అందించారు. మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన పుష్పలత గతంలో ఎంపీటీసీగా, సామాజిక కార్యకర్తగా పలు గ్రామాలలో సేవలు అందించారు. కార్యక్రమంలో ఏఎమ్‌సీ డైరెక్టర్ సత్యారెడ్డి, నాయకులు ముత్యం బాగ్యలక్ష్మి, గడ్డమీది నాగలక్ష్మి, బొల్లం శ్రీనివాస్, వెంకటేశం, లింగం, రాంరెడ్డి, అశోక్, ఆది మల్లయ్య, సాయితిలక్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం కప్పతల్లి ఆట

రుద్రంగి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : వర్షకాలం ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా వర్షలు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయాని రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాల కోసం మానాలలో బుధవారం కప్పతల్లి ఆటలు ఆడారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.

కల్వర్టు పనులను పరిశీలించిన అధికారులు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



పనులను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ అధికారులు

కోనరావుపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలో ఉన్న కల్వర్టు పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి పంచాయతీరాజ్ అధికారులు స్పందించి పనులను పరిశీలించారు. మండలకేంద్రానికి సమీపంలో ఉన్న ప్రధాన రహదారి కల్వర్టు కూలిపోవడంతో ప్రజలు ఇబ్బందులుపడ్డారు. దాని స్థానంలో కల్వర్టును నిర్మించేందుకు సదరు కాంట్రాక్టర్ పనులు ప్రారంభించినప్పటికీ నత్తనడకన సాగుతున్నాయి. ఈవిషయమై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి పంచాయతీరాజ్ అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

ముర్రు పాలు బిడ్డకు శ్రేయస్కరం

కోనరావుపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టిస్తే బిడ్డ శ్రేయస్కరంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కనకలక్ష్మి అన్నారు. మండలంలోని కొలనూరు తదితర గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : మండలంలోని బండపల్లిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు రేణుక, పద్మలు, ఎంఎల్‌హెచ్‌పీ నవ్య జ్యోతి, ప్రధానోపాధ్యాయులు ఆనందరెడ్డి, అనిల్‌రావు, ఉపాధ్యాయులు పద్మ, శైలజ, ఏఎన్ఎం వజ్ర, వసంత పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : తల్లిపాల ఆవశ్యకతపై గాలిపెల్లిలో సమావేశం జరిగింది. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు విజయ, కవిత, విజయ, సరిత, భారతి, లక్ష్మిలతో పాటు తల్లులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : మండలంలోని కొండాపూర్‌లో తల్లిపాల వారోత్సావాలను నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరవింద, అంగన్‌వాడీ టీచర్ క్యారం లక్ష్మి, బొందుగుల పల్లవి, కాపరవేని రేణుక, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి

కోనరావుపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తానని సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి అన్నారు. కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో లోవోల్టేజ్ సమస్య తీర్చేందుకు 100కేవీఏ నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సెస్ ఏఈ దివ్య, లైన్ ఇన్‌స్పెక్టర్ వైకుంఠం, సింగిల్ విండో వైస్ చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, కాంట్రాక్టర్ జీవన్ గౌడ్, రైతులు వంగపల్లి రాజు, రాజిరెడ్డి, గోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా.. తప్పిన ప్రమాదం

కోనరావుపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం నిమ్మపల్లి ఎక్స్ రోడ్డు వద్ద ఇసుక ట్రాక్టర్ బోల్తాపడగా పెద్ద ప్రమాదం తప్పింది. ఎగ్లాస్‌పూర్ గ్రామానికి చెందిన తాడూరు సాయి కోనరావుపేట మూలవాగు నుంచి ఎగ్లాస్‌పూర్ గ్రామానికి తీసుకొని వెళుతుండగా నిమ్మపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద ఇసుక ట్రాక్టర్ బోల్తాపడింది. డ్రైవర్ సాయి తప్పుకోవడంతో ప్రమాదం తప్పింది.

మధ్యాహ్న భోజన నిర్వాహకుల ముందస్తు అరెస్టు

కోనరావుపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండల మధ్యాహ్న భోజన నిర్వాహకులను కోనరావుపేట పోలీసులు బుధవారం ముందస్తు అరెస్ట్ చేశారు. మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలను పరిష్కరించేందుకు సీఐటీయూ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ ధర్నాకు వెళ్తారన్న నేపథ్యంలో జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డితో పాటు మధ్యాహ్న భోజన నిర్వాహకులు బాలమణి, వసంత, వెంకటలక్ష్మి, సత్యవ్వలను పోలీసులు అరెస్ట్ చేశారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందివ్వాలి..

- రూ.20 కోట్లతో 170 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం.. - కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా

తంగళ్లపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని, ప్రీప్రైమరీ పాఠాలు బోధించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. బుధవారం తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామంలో నూతనంగా నిర్మించిన రెండు అంగన్‌వాడీ కేంద్రాల భవనాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 585 అంగన్‌వాడీ కేంద్రాలు ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్నాయని అన్నారు. డీఎంఎఫ్టీ నిధులు రూ. 20 కోట్లతో జిల్లాలోని మొత్తం 170 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. సిరిసిల్ల నియోజకవర్గ పరిధిలో 49కేంద్రాల నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆరునెలల్లో నూతన భవనాలు అందుబాటులోకి తెస్తామన్నారు. ప్రీప్రైమరీ విద్య బలోపేతానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. దీంట్లో భాగంగా నూతన భవనాల నిర్మాణం, మౌళిక వసతులు కల్పిస్తుందని పేర్కొన్నారు. పిల్లలు ఆడుతూ పాడుతూ విద్యను అభ్యసించే అవకాశం వస్తుందని వివరించారు. పక్కా భవనాలతో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇబ్బందులు తొలగిపోతాయని అన్నారు. తంగళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయం అవరణలో నిర్వహించిన పశువుల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఎస్సీ లబ్ధిదారులకు 2 పశువుల ను సబ్సిడీపై అందిస్తున్నమని తెలిపారు. వీటి నిర్వహణ సక్రమంగా చేసి రెండు పశువుల సంఖ్యను 10 పశువుల స్థాయికి పెంచుకోవాలని సూచించారు. గత ప్రభుత్వ హయంలో స్కీంల పేరుతో స్కాంలకు పాల్పడిందని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజక వర్గ ఇంచార్జ్ కేకే మహేందర్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పథకం సంపూర్ణంగా అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేశ్వర్లు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, ఈడీ ఎస్సీ కార్పోరేషన్ స్వప్న , ఎంపీడీవో లక్ష్మినారయణ, లబ్దిదారులు పాల్గొన్నారు.

అలాగే మండల కేంద్రంలోని గిరిజన మహిళ డిగ్రీ కళాశాలను, చీర్లవంచ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని అన్ని తరగతి గదులు, స్టాఫ్ రూమ్, స్టోర్ రూమ్, కిచెన్, లైబ్రరీ, టాయిలెట్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, మైక్రో బాయాలజీ ల్యాబ్‌లను ప్యాషన్ డిజైనింగ్ ఫోటోగ్రఫీ స్టూడియోలను పరిశీలించారు.

అలాగే చీర్లవంచ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారీ కోసం గ్యాస్ కనెక్షన్‌ను కలెక్టర్ సందీప్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహెందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు.

పదో తరగతి విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

వీర్నపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి జీవితంలో పదో తరగతి మైలు రాయిలాంటిదని బీజేపి జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. వీర్నపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులకు సీఎస్ఆర్ నిధుల ద్వారా కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ మోది గిఫ్ట్ పేరుతో అందించిన 36సైకిళ్లను పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఎంఈవో తుమ్మ శ్రీనివాస్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద విద్యార్థులు పాఠశాలకు సమయానికి వచ్చి చదువుకోవడంలో ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు సైకిళ్లను పంపిణీ చేస్తున్నారన్నారు. పదో తరగతిలో విద్యార్థులు ఉన్నతంగా చదివి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. బండి సంజయ్ ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి చదివే విద్యార్థులకు మోదీ గిఫ్ట్ పేరుతో బ్యాగులను అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మాలోతు లక్పతి నాయక్, ఎమ్మార్వో ముక్తార్‌పాషా, ఎస్ఐ లక్ష్మణ్, బీజేపి యూత్ అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ నర్సవ్వ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించాలి

బోయినపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): చెరుకు సాగులో రైతులు ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ మదన్‌మోహన్ అన్నారు. బోయినపల్లిలో చెరుకు సాగుపై రాష్ట్ర రైతు విజ్ఞాన కేంద్రం, కరీంనగర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో ప్రణీత,మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతిగౌడ్, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

కష్టసుఖాల కలనేత..

(5వ పేజీ తరువాయి)

2662 మంది పథకంలో చేరారు. చేనేత లక్ష్మి పథకంలో చేరిన ఉద్యోగులు వస్త్రాలను కొనుగోలు చేశారు. ఈ పథకం మళ్లీ కొనసాగలేదు. వేములవాడ కేంద్రంగా కేంద్ర ప్రభుత్వం చేనేత క్లస్టర్‌గా గుర్తించింది. క్లస్టర్ కింద రూ.1.19 కోట్ల నిధులను మంజూరు చేసింది. దీనిలో భాగంగా రూ 50లక్షలతో మౌలిక వసతుల కేంద్రం ఆధునిక డిజైనతో కార్మికులకు శిక్షణ కార్యక్రమాలను చేపట్టింది. మొదటి విడతలో రూ 19.10 లక్షలు విడుదల చేయగా 300మంది లబ్ధిదారులు కొత్త డిజైన్ల అభివృద్ధి, చేనేత శిక్షణను పొందారు. జిల్లాలో ప్రతి సంవత్సరం రూ 2 కోట్ల చేనేత వస్త్రాలు ఉత్పత్తి జరుగుతున్నాయి. జిల్లాలో 169 చేనేత మగ్గాలు ఉండగా అందులో కొన్ని వినియోగంలో లేవు. చేనేత మగ్గాలకు జియో ట్యాగింగ్ చేశారు. జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ, చందుర్తి, బోయినపలి, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట, గంభీరావుపేట,కోనరావుపేటలో మగ్గాలు ఉన్నాయి. ఇందులో సిరిసిల్లలో మహేశ్వర సొసైటీ, సిరిసిల్ల సొసైటీ, జగదాంబ సొసైటీ, వేములవాడ, హన్మాజీపేట, మామిడిపెల్లి సొసైటీలతో పాటు ఖాదీగ్రామోద్యోగ, తంగళ్లపల్లి సొసైటీల్లో చేనేత మగ్గాలు కార్మికులకు ఉపాధిని అందిస్తున్నాయి.

నేతన్నకు 'అభయ హస్తం'

ప్రభుత్వం చేనేత, మరమగ్గాల కార్మికులకు మూడు పథకాలు అందించడానికి ఒకే గొడుగు కిందికి తీసుకవచ్చే చర్యలు చేపట్టింది. అభయహస్తం పేరుతో పొదుపు నిధి, బీమా భరోసా, చేనేత భరోసా, పథకాలను అందించే దిశగా చర్యలు చేపట్టింది. సిరిసిల్ల మరమగ్గాల కార్మికులకు బతుకమ్మ చీరల స్థానంలో స్వశక్తి మహిళలకు అందించే చీరల ఆర్డర్లు, సర్వశిక్ష అభియాన్ వంటి ఆర్డర్లను అందించిన క్రమంలోనే నేతన్న పొదుపు నిధి, నేతన్న బీమా, నేతన్న భరోసా పథకాలను ప్రభుత్వం ఒకే గొడుగు కిందకు తీసుకవచ్చి నేతన్నకు అభయ హస్తం పేరుతో పథకాలను ముందుకు తీసుకరావడం, చేనేత భరోసా మార్గదర్శకాలు ప్రకటించడం కార్మికుల్లో హర్షం వ్యక్తంఅవుతోంది. నేత కార్మికుల ఆర్థికాభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని భావిస్తున్నారు. ప్రాథమికంగా మూడు పథకాలకు సంబంధించి ప్రభుత్వం రూ 168 కోట్లు విడుదల చేశారు. నేతన్నకు అభయహస్తంలో భాగంగా మూడు పథకాలు ఒకే గొడుగు కిందికి చేర్చడంతో పాటు చేనేత కార్మికులు పొదుపు నిధికి అవకాశం కల్పించింది. చేనేత భరోసా పథకానికి 212మంది కార్మికులను గుర్తించారు. జిల్లాలో చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ పథకంలో రూ 45లక్షలు మంజూరు చేశారు. కార్మికులకు పావలా వడ్డీ పథకంలో 212మంది కార్మికులకు రూ.15.6 లక్షలు సహకార సంఘాలకు అందించారు.

ఆగిన చేనేత సహకార సంఘాల ఎన్నికలు

చేనేత సహకార సంఘాలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందనే విమర్శలు ఉన్నాయి. చేనేత జౌళి శాఖ రంగాల్లో ఉన్న సొసైటీల ఎన్నికల గడువు ముగిసి ఆరేళ్లు దాటిపోయినా పర్సన్ ఇన్‌చార్జిలతోనే సుదీర్ఘంగా కాలం వెల్లదీస్తున్నారు. గత సంవత్సరం జూన్‌లో చేనేత సహకార సంఘాలకు ఎన్నికల నిర్వహణకు కాస్తా హడావిడి చేయడంతో కార్మికులు ఎన్నికలు జరుగుతాయని భావించారు. ఏర్పాట్ల వరకు వెళ్లి సంవత్సరం దగ్గర పడుతున్నా ఎన్నికల ఊసే మరిచారు. ఎట్టకేలకు ఎన్నికల నిర్వహణకు కసరత్తు మొదలు పెట్టినా ఒక అడుగు ముందుకు, రెండు అడుగులు వెనక్కి అన్నట్లుగా మారింది. పాలకవర్గాల గడువు ముగిసి ఆరేళ్లు దాటినా పర్సన్ ఇన్‌చార్జీల కాలమే పొడిగిస్తున్నారు. గత సంవత్సరం రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఐదు సంవత్సరాలు పూర్తిచేసుకున్న అన్ని సహకార సంఘాల కార్యవర్గాలకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర సహకార సంఘాల ఎన్నికల అథారిటీ ఆదేశాలు జారీ చేసింది. దీంతో చేనేత సహకార సంఘాల ఎన్నికలపై దృష్టి పెట్టారు. ఐదేళ్లకొకసారి నిర్వహించాల్సిన చేనేత సహకార సంఘాల ఎన్నికలు 2013లో చివరిసారిగా నిర్వహించారు. వీరి పదవీ కాలం 2018 ఫిబ్రవరితో ముగిసింది. ఆ సమయంలోనే ఎన్నికలు నిర్వహించాలని 40 రోజుల ముందే నోటిఫికేషన్ జారీచేసే విధంగా చేనేత కార్మికులతో ఓటు హక్కు అర్హత కలిగిన జాబితాను జౌళి శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. గత సంవత్సరం మరోసారి ఎన్నికల నిర్వహణకు జాబితాలు సిద్ధం చేసినా ఎన్నికల వైపు అడుగులు పడలేదు.



మూలనపడ్డ మగ్గాలు

సిరిసిల్లలో చేనేత విగ్రహం..

సిరిసిల్ల అనగానే మొదట గుర్తుకు వచ్చేది చేనేత, పవర్‌లూం కార్మికులు. వస్త్ర సంక్షోభంతో ఎప్పుడూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందు సిరిసిల్ల సమస్యలతో ముందుంటుంది. సిరిసిల్లలో చేనేత మగ్గాలతో పాటు 35 వేల మరమగ్గాలు, అనుబంధ పరిశ్రమలతో ఉంది. ఈక్రమంలో సిరిసిల్ల పాత బస్టాండ్‌లో 2010లో ఏర్పాటు చేసిన భారీ చేనేత కార్మికుడి కాంస్య విగ్రహం ఒక ప్రత్యేకతగా నిలిచింది.

నిలిచిన మధ్యాహ్న భోజనం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజనం నిర్వాహకులు ఈనెల 6, 7 తేదీల్లో సమ్మెకు పిలుపునిచ్చారు. ఈక్రమంలో బుధవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిలిచిపోయింది. దీంతో విద్యార్థులు ఇళ్ల నుంచి బాక్స్‌లు తెచ్చుకోవాల్సి వచ్చింది. కొన్ని పాఠశాలల్లో దినసరి కూలీలతో మధ్యాహ్న భోజనం తయారుచేయించారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

చందుర్తి ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం బండపల్లిలో బుధవారం ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మహంకాళి శంకర్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. బింగి స్వామి, మహంకాళి లచ్చయ్య, గసికంటి శశి, కుమ్మరి రాములు, బింగి శంకర్, రామస్వామి, లచ్చయ్య, స్వామి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

ఇల్లంతకుంట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఇల్లంతకుంటలో కేంద్రప్రభుత్వ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ మాజీ అధ్యక్షుడు నాగసముద్రాల సంతోష్, వ్యాకల మల్లేశం, ఇట్టిరెడ్డి లక్ష్మారెడ్డి, బత్తిని సాయగౌడ్, కర్ల లక్ష్మన్, కూనబోయిన బాలరాజు, కూనబోయిన కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చందుర్తి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం జోగాపూర్, ఎనగల్ గ్రామాల లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య బుధవారం అందజేశారు. జోగాపూర్ గ్రామానికి చెందిన అమరబండ లాస్యకు రూ.22000, ఎనగల్‌కు చెందిన మాదాసు రమాదేవికి రూ.18500 చెక్కులను అందజేశారు. మ్యాకల పరశురాములు, కుసుంబా జనార్ధన్, మాదాసు ప్రసాద్, గుంటి గంగాధర్, గొల్లపల్లి పరిసరాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గద్దర్ వర్ధంతి..

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజా యుద్ధనౌక గద్దర్ వర్ధంతిని మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, గిరిధర్‌రెడ్డి, బాబు, రాజ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : మండల కేంద్రంలోని గద్దర్ వర్ధంతిని నిర్వహించారు. మాలల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం, ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్, అధికార ప్రతినిధి రఘు, సందీప్ తదితరులు ఉన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

- కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు రాజకీయాలతో పాటు విద్యా, ఉద్యోగ రంగాలలో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కామారెడ్డి సాక్షిగా కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీ ఇచ్చిన డిక్లరేషన్ హామీలతో పాటు బీసీ రిజర్వేషన్లను నీటి మూటలుగా బీసీ సమాజం భావిస్తుందని, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించకుండనే కాంగ్రెస్ ప్రభుత్వం అభూత కల్పన సృష్టిస్తుందని ఆరోపించారు. ఢిల్లీలో కూడా కొత్త డ్రామాను మొదలు పెట్టిందని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు దోబూచులాడుతూ బీసీ సమాజాన్ని మోసం చేయాలని చూస్తున్నాయన్నారు. హామీలను అమలుచేయకుంటే బీసీలను ఏకం చేసి అమలు చేయిస్తామని అన్నారు. బీసీ రిజర్వేషన్లను అమలు చేయించుకోవడం కోసం బీసీ బిడ్డలంత సంఘటితం కావల్సిన సమయం వచ్చిందన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రానున్న రోజులలో కరీంనగర్ వేదికగా సభను నిర్వహిస్తామన్నారు. బీసీ సమాజం పెద్దసంఖ్యలో తరలిరావాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయకుండా బీసీ అంశాన్ని ముందట వేసుకుందని ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాష్ట్రంలో పాదయాత్రలతో ప్రజలను మరోసారి మోసం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అన్నారు. సమావేశంలో నాయకులు శీలం స్వామి, నందగిరి భాస్కర్‌గౌడ్, మెరుగు తిరుపతి, నమిలికొండ అనిల్, కుర్మాని ప్రశాంత్, బోటుకు అజయ్, పిట్ల విన్నూబాయి, అమరకొండ కృష్ణప్రసాద్, పరిదిపేట వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి



సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం గద్దర్ వర్ధంతిని నిర్వహించారు. ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్, ప్రజానౌక గద్దర్ చిత్రపటాలకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్ పూలతో నివాళులర్పించారు. బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, మహిళ పట్టణ అధ్యక్షురాలు బత్తుల వనజ, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ ఆడగట్ల మురళి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, మాజీ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు దార్ల సందీప్, రిక్కుమల్ల సంపత్‌కుమార్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, నాయకుల కుంభాల మల్లారెడ్డి, కొండ శంకర్, బత్తుల రమేష్, గడ్డం భాస్కర్, న్యాలకొండ రాఘవరెడ్డి, కంచర్ల రవిగౌడ్ పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండలంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్తు కార్యాలయం, తహసీల్ కార్యాలయాలతో పాటు వివిధ గ్రామాల్లో అధికారులు, తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు జయశంకర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్తయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్టారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : మండలంలోని జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్వో ముక్తార్‌పాషా, హెచ్ఎం శ్రీనివాస్, బీఎస్సీ మండల అధ్యక్షుడు ప్రశాంత్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● గంభీరావుపేట : మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జయంతిని నిర్వహించారు. విశ్వబ్రాహ్మణుల సంఘం నాయకులు ప్రభాకర్, వేణు, కృష్ణప్రసాద్, పలు పార్టీల నేతలు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలంలో వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీవో శశికళ, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ గంగాధర్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్ : వేములవాడ పట్టణంలో జయంతి వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. రామతీర్థపు రాజు, నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి చందు, మారం కుమార్, నరాల శేఖర్, కుమ్మరి శ్రీనివాస్, నీరటి మల్లేశం ఉన్నారు.

● చందుర్తి : మండల కేంద్రంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ శ్రీనివాస్, సింగిల్‌విండో చైర్మన్లు తిప్పని శ్రీనివాస్, జలగం కిషన్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, నాయకులు ఆశోక్, శ్రీనివాస్,రమేష్, ఇస్మాయిల్, నగేష్, గబ్బర్‌సింగ్, కమలాకర్, అనంద్, ఎల్లయ్య, గంగారెడ్డి, గంగాధర్, పర్శరాములు, తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల క్రైం : ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతిని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐలు రమేష్, యాదగిరి,కార్యాలయ సూపరింటెండెంట్‌లు, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండలంలోని పల్లిమక్తలో వేడుకలను నిర్వహించారు. కోనరావుపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాయిని ప్రభాకర్‌రెడ్డి, మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ రాహుల్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో సైబర్ నేరాలపై బుధవారం ఆయన అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు చోటుచేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గుర్తు తెలియని వ్యక్తులకు తమ వివరాలను అందించకూడదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్నందున విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై బాల్‌రెడ్డి సూచించారు. రహీంఖాన్‌పేట గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో బుధవారం సైబర్ నేరాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్‌లకు వచ్చిన ఓటీపీలు చెప్పవద్దని, యూపీఐ, క్రెడిట్‌కార్డులు వాడేవారు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాధర్, పీసీ మోహన్‌లతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వేము లక్ష్మణ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై బధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు క్రమశిక్షణపై కౌన్సిలింగ్ నిర్వహించారు. విద్యాలయంలో సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి తుమ్మ శ్రీనివాస్, ప్రిన్స్‌పాల్ డాక్టర్ అశోక్, పీడీలు ప్రతాప్, చామంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.